* 'ప్రసీల్' *

రైలు కుదుపులో హంతకాంతక చక్రవర్తిగారి భూతద్దం ఫటాల్న కిందబడి ముక్కలు చెక్కలైంది.

"అయ్యయ్యో, కుడిభుజం లాంటి మీ భూతద్దం కాస్తా కింద పడిపోయిందికదా, ఇహ మీకు మిగిలిందల్లా ఎడంభుజమే కదా" అని దుఃఖించాను నేను.

"నువ్వు పొరబాటుబడ్డావ్ తమ్ముడూ. గుడ్డివాని చేతుల్లో తొందర ఉంటే ఏ మాత్రం ప్రయోజనముంటుందో, సూక్ష్మ, తీక్ష్ణ, పరిశీలనా దృష్టులు లేనివాడి చేతుల్లో భూతద్దానితో అంతే ప్రయోజనముంటుంది. ఆపై మూడుగుణాలేవున్నట్లయితే భూతద్దం సహాయంలేకుండానే గొప్ప అపరాధ పరిశోధకుడుగా పేరు సంపాదించవచ్చు. భూతద్దం కేవలం నిమిత్త మాత్రం" అన్నాడు సుప్రసిద్ధ అపరాధ పరిశోధకుడు, 'అరి భయంకర', 'రిపు భీకర' బిరుదాంకితుడయిన హంతకాంతక చక్రవర్తి.

చక్రవర్తీ, నేనూ రైల్లో సెకండుక్లాసు బెర్తులు చెరొకటీ ఆక్రమించుకొని పడుకున్నాం. చక్రవర్తి తెలివితేటల్లో ఏ మాత్రం నాకు అబ్బినా నా జీవితం ధన్యమవగలదని నా నమ్మకం. అందుకోసం ఎప్పుడూ చక్రవర్తితో తిరుగుతుండడమే నా ఉద్యోగం. చక్రవర్తి మళ్ళీ మాట్లాడుతున్నాడు:

"ఇప్పుడీ కిందికి చూడు, అక్కడ ఒక ఆడది, ఒక మొగవాడు కనిపిస్తున్నారు" అన్నాడు చక్రవర్తి.

రెండో క్లాసులో ప్రయాణిస్తున్నారు కదా అన్న ధైర్యంతో, 'సంపన్నులై వుండుంటారు' అన్నాను.

"తప్పు తమ్ముడూ, ఇంటర్ క్లాసులో ఖాళీ లేక పోయినందువల్ల రెండో క్లాసులోకి ఎక్కివచ్చారు. కాని సంపన్నులై వుండి కాదు" అన్నాడు హంతకాంతక చక్రవర్తి.

"వాళ్ళిద్దరి సంబంధ మేమై యుంటుంది?" అని చక్రవర్తి కొంతకాలం రైలుకప్పువంక తీక్ష్ణంగా చూశాడు. నాకు తెలిసిన ఒక్క ముక్క అన్నాను: "పక్కింటి అమ్మాయిని లేవనెత్తుకెళ్తున్న బాపతేమో".

"తమ్ముడూ, నువ్వు కథకుడివి, అందువల్లనే ఆ పొరపాటు పడ్డావ్. వాళ్ళిద్దరూ నిజంగా అన్నా చెల్లెళ్ళు" అన్నాడు చక్రవర్తి.

"చూడదల్చుకున్న వాడికి ఎన్నైనా కనపడతవి. వినదల్చుకున్నవాడికి ఎన్నైనా వినబడతవి. వారి సంభాషణనాలకించు. హత్యలకూ, దొంగతనాలకూ, మోసాలకూ, అన్యాయాలకూ, కష్టాలకూ ఎంతో దూరం వెళ్ళి వెతకనక్కరలేదు. మనకళ్ళముందరే వుంటై. కళ్ళుంటే చూడు. చెవులుంటే ఆలకించు" అని ఏసుక్రీస్తును గుర్తుకు తెచ్చాడు హంతకాంతక చక్రవర్తి.

చెల్లెలు, అన్నయ్యతో ఏదో ఒకటే చెప్తున్నది. "నే నెన్నిసార్లో అనుమానపడుతూనే... నాకు మొదట్నుంచీ... ఈ రాత్రిపూట ఆలస్యంగా రావటాలూ... నేనంటే నిర్లక్ష్యం... ఈ మధ్య మరీ, అన్యాయం... మొన్న వారం రోజులక్రిందట అయిన గదివంకకు... ఆ లోపల్నుంచి మాటలు... ఛీ, ఛీ, ఈయన, దాన్ని వేడు... అది నిరాకరించటం... మళ్ళీ దాని వెంటే ఈయన... ఛీ, ఛీ, కట్టుబట్టలతో బయలుదేరివచ్చాను" రైలు శబ్దం కొన్ని మాటలుమింగగా, వినిపించిన మిగతభాగాలు అవి.

"సరే పోయి చూద్దాం పద, పోతున్నాంగా" అని ఓదారుస్తున్నాడు అన్నయ్య.

"ఏం గ్రహించావ్?" అన్నాడు చక్రవర్తి.

"భర్త ఎవరితోనో..."

"అమోఘం, కరెక్టు" అంటూ పై బర్త్ మీది నుంచి కిందికి దూకాడు చక్రవర్తి. చక్రవర్తిచే ప్రోత్సహింపబడి నేనూ అతడ్ని అనుసరించాను.

"నేను హంతకాంతకాన్ని" అన్నాడు చక్రవర్తి వాళ్ళిద్దరినీ తీక్ష్ణంగా చూస్తూ.

ఆవిడ "ఐతేనేం" అన్నట్లు చూసింది.

అతడు మాత్రం, ఆశ్చర్యపడి, తెప్పరిల్లుకొని "నమస్కారం. మిమ్మల్ని గూర్చి వినడమే గానీ,

ఎన్నడూ చూడటం తటస్థపడలేదు. మీ పరిచయ భాగ్యం కలిగినందుకు సంతోషం" అన్నాడు.

"నా అనుచరుడు, స్నేహితుడు ఐన ప్రవీల్" అంటూ నన్ను చూపాడు.

"కథలు రాస్తుంటారు కదూ?" అంటూ నా వంక నిరసనంగా చూశాడు అతడు. దూరదృష్టిణి, 'అవున'న్నట్లుగా ఒప్పుకున్నాను.

"మీతోబాటు వస్తాము" అన్నాడు చక్రవర్తి.

"ఇదెక్కడి పీడ" అన్నట్టు చూసింది ఆవిడ. 'ధన్యులం' అన్నాడు అతను.

కొంతసేపటికి మద్రాసులో రైలు దిగి, అవసరం కొద్దీ టాక్సీ చేయించుకొని వాళ్ళింటికి చేరాం.

టాక్సీని వాళ్ళ వీధిమలుపుదగ్గరే ఆపించాడు చక్రవర్తి. డబ్బిచ్చి వాణ్ణి పంపించేశారు. మేము నలుగురం ఓ ఫర్లాంగు నడిచి ఆ ఇంటికి చేరాం. మా ముగ్గురినీ, వాకిట్లో వుండమని చెప్పి మెల్లగా లోపలికి వెళ్ళాడు చక్రవర్తి. కొంతసేపటికి వెనక్కు తిరిగివచ్చి, నిశ్శబ్దంగా మమ్మల్ని రమ్మని సౌంజ్ఞ చేశాడు. మేం ముందరం మెల్లిగా పడకగదికి దారితీశాం. తలుపులు లోపలపక్క బిగించి వున్నై.

"మాలతీ, నా మాట విను...దాన్ని వొదిలేస్తాను, నీతో ఎక్కడికి లేచిరమ్మంటే అక్కడికి వస్తాను" అని ఓ మొగగొంతు వినిపిస్తున్నది.

"పెండ్లిచేసుకున్నావు నువ్వు. నీతో నేనెలా లేచి వస్తాను?" అంటూ ఓ ఆడగొంతు వినిపిస్తున్నది.

చక్రవర్తి ఏం చేస్తాడా అని ఆలోచిస్తున్నాను నేను. పిడికిళ్ళు బిగబట్టాడు అన్నయ్య. చిరునవ్వు నవ్వుతున్నాడు హంతకాంతక చక్రవర్తి. అది చూసి మండిపడుతున్నది చెల్లెలు.

"తలుపులు విరగ్గొడదాం" అంటూ గర్జించాడు అన్నయ్య.

"అక్కరలేదు" అంటూ చక్రవర్తి, "అయ్యా తలుపులు తియ్యండి" అంటూ పిలిచాడు.

తలుపులు తెరుచుకున్నై. "అమ్మనిషేది?" అంటూ లోపలికి దూకాడు అన్నయ్య. "నే చెప్పలేదన్నయ్యా, ఇంత మరీ పట్టపగలు ఇట్లా అన్యాయం చేస్తున్నారని" అంటూ ఏడ్చింది చెల్లెలు.

గదిలో దోషి ఒక్కడే కనిపించాడు.

"ఎక్కడ దాచావ్?" అంటూ అతనిమీదికి వెళ్ళాడు బావమరది.

"మీరందరూ ఎందుకు రావాలి?" అన్నట్లుగా చిరాకుగా చూస్తున్నాడు సూర్యనారాయణ.

"ఏకపాత్రాభినయంకోసం ప్రాక్టీసు చేసుకుంటున్నాడు, తలుపులు మూసి చేసుకుంటే అనుమానాస్పదంగా తయారైంది" అంటూ సిగరెట్ వెలిగించాడు హంతకాంతక చక్రవర్తి.

రెండో రోజు ఏకపాత్రాభినయ పోటీలో సూర్యనారాయణ ప్రథమ బహుమతి పొందాడని కాలేజీ వార్తాపత్రికల్లో చూశాం.

# అవే....పాదాలు!

తోలేటి విశ్వనాధరావు

★

కాలమాన పరిస్థితుల్నిబట్టి అందరికిమల్లేనే దేముళ్ళకుకూడా ప్రజలమీద పలుకుబడి హెచ్చడం తగ్గడం ఉంటూఉంటుంది. అంతకు ముందు రాముడు కృష్ణుడు అంటే భక్తికలవాళ్లు ఆ తరువాత వెంకటేశ్వర్లుని పూజించటం మొదలుపెట్టారు, ఈ మధ్య హరనాథ్‌బాబా సాయిబాబా వంటి బెంగాళీ మహాత్ములకి ప్రజల్లో పేరుప్రతిష్టలు హెచ్చాయి.

★

ఆ రోజు సత్యవతమ్మగారి యిల్లు కిటకిటలాడుతోంది....ఎక్కడలేని భక్తులు ఆమె యింట్లోనే ఉన్నారు....కారణం హరనాథ్‌బాబా రెండు పాదాలు ఆ యింట్లో గోడమీద వెలిసాయ్....వాటికి ఉదయంనుంచి ఒక్క విధంగా పూజలు పునస్కారాలు జరుగుతున్నాయి........గదంతా అరటిపళ్ళతోను కొబ్బరికాయలతోను నిండిపోయింది....హరహర శబ్దాలు గింగురుమంటున్నాయి....

★

సాయంత్రం సత్యవతమ్మగారి భర్త ఆఫీసునుంచి వచ్చారు. ఈ గందరగోళం ఆయనకి అర్థంకాలేదు....సంగతి తెలిసికొని ఆశ్చర్యపోయారు ఆయన....అసలువిషయం ఏమిటంటే, ఉదయం ఆయన బయటనుంచి వచ్చేటప్పుడు బురదకాళ్ళు కడుక్కోకుండా కుర్చీమీద కూర్చొని, కాళ్లు రెండూ గోడకానించి పేపరు చదువుకున్నారు....ఆ బురదకాళ్ళ ముద్ర గోడమీద పడింది....అవే హరనాథ్ పాదాలు!....